
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
గురువారం 12 డిసెంబరు 2024

నేడు, రేపు సైన్స్ ఎగ్జిబిషన్

వికారాబాద్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కొత్తగడి గురుకుల సంక్షేమ పాఠశాలలో నేడు, రేపు సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్స్పైర్ కార్యక్రమం ఉంటుందని డీఈవో రేణుకాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆహారం ఆరోగ్యం పరిశుభ్రత, రవాణా కమ్యూనికేషన్ తదితర అంశాలపై ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఇప్పటికే 55 ప్రాజెక్టులు ఎంపికయ్యాయన్నారు. ప్రతీ ప్రదర్శనకు ఒక విద్యార్థితో పాటు ఒక గైడ్ టీచర్ హాజరుకావాలన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్
- శీతాకాల విడిది ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికి హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలోని జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. నగరంలోని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు ఆమె బస చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది మాదిరిగా రాష్ట్రపతి శీతాకాల విడిదికి ఈ నెల 17వ తేదీన హకీంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి బొల్లారం చేరుకుంటారన్నారు. ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రపతికి ఆహ్వానం పలికేందుకు వీఐపీలు వస్తారని అందుకు అవసరమైన ఏర్పాట్లు సైతం పూర్తి చేయాలన్నారు. ఆమె ప్రయాణించే రోడ్లు ఎలాంటి గుంతలు, గతుకులు లేకుండా చూడాలన్నారు. దీంతో పాటు షామియానాలు, కుర్చీలు, వేదికకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను చేయాల్సిందిగా రోడ్లు, భవనాల శాఖ అధికారికి సూచించారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా అన్ని రకాల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ అధికారులు సైతం ఎక్కడ కూడా చెత్త కనబడకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అలాగే విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, ఆర్డీఓలు శ్యాం ప్రకాశ్, సైదులు, ఏసీపీ రాములు, ఆయా శాఖల జిల్లా అధికారులు, పోలీసు, రెవెన్యూ, విద్యుత్తు శాఖల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు జిల్లాలో కసరత్తు ప్రారంభమైంది. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేకమైన యాప్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ప్రజాపాలన కార్యక్రమంలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలన్నీ ఈ యాప్‌లో పొందుపరిచారు. వచ్చిన దరఖాస్తులను 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్ ద్వారా పరిశీలించి అర్హులను గుర్తించారు. ప్రజాపాలన కార్యక్రమంలో 2,64,242 దరఖాస్తులు రాగా, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా పరిశీలించిన తర్వాత 2,57,256 దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించినట్లు తెలిసింది. వీరి ఇళ్లకు వెళ్లి సర్వే చేసి వాస్తవాలను నిర్ధారించనున్నారు.


ఇందిరమ్మ ఇల్లు నమూనా

గృహయోగం!

లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు షురూ

ఇంటింటి సర్వేకు సన్నాహాలు

- సర్వే చేయనున్న సిబ్బందికి శిక్షణ పూర్తి
- యాప్‌లో 35 అంశాలపై వివరాల సేకరణ
- మహిళల పేరిటనే ఇళ్లు మంజూరు
- నాలుగు దశల్లో రూ.5 లక్షలు పంపిణీ
- ఖాళీ స్థలాలకు జియో ట్యాగింగ్
- రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయింపు
- ప్రజాపాలనలో 2,64,242 దరఖాస్తులు

వికారాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇందిరమ్మ ఇళ్ల అసలైన లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు ఇంటింటి సర్వేను ప్రారంభించనున్నారు. ఇందుకుగాను ఇప్పటికే రెండు విడతల్లో వారికి శిక్షణ ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి యాప్‌లోని వివరాలను నిర్ధారించాల్సి ఉంటుంది. సర్వే నిర్వహించే బాధ్యత గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు/జూనియర్ అసిస్టెంట్లు/ బిల్ కలెక్టర్లకు అప్పగించారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి సేకరించాల్సిన వివరాలు, అర్హులను గుర్తించే విషయమై ఇప్పటికే వారికి శిక్షణ తరగతులు నిర్వహించారు. నిబంధనలకు భిన్నంగా వ్యవహరించి అనర్హులను ఎంపిక చేస్తే సంబంధిత ఉద్యోగులనే

మిగతా 8వ పేజీలో...

రెండు రోజుల్లో సర్వే ప్రారంభం



జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం అర్హులను ఎంపిక చేసేందుకు ఇంటింటి సర్వే నిర్వహించే సిబ్బందికి లాగిన్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు ఇచ్చి శిక్షణ ఇచ్చాం. రెండు, మూడు రోజుల్లో సర్వే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఇందిరమ్మ యాప్‌లో వివరాలు నమోదు చేసేప్పుడు సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాం.

- లింగ్యానాయక్, అదనపు కలెక్టర్

పట్నం నరేందర్‌రెడ్డి రిమాండ్ పొడిగింపు

కొడంగల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో ఏ-1గా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రిమాండ్‌ను కొడంగల్ మున్సిఫ్ కోర్టు పొడిగించింది. జ్యూడిషియల్ రిమాండ్ గడువు ముగియడంతో 24 వరకు పొడగిస్తూ న్యాయమూర్తి బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఆయనతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్నవారి రిమాండ్ గడువును కూడా కోర్టు పొడిగించింది. కాగా, నరేందర్‌రెడ్డి కస్టడీకి పోలీసులు మరోసారి పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.


సంచుల్లో నింపి రోడ్డు పక్కన పడేసిన కరెన్సీ నోట్ల ముక్కలు

చింపి ముక్కలు చేసి పడేసిన కరెన్సీ నోట్లు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరెన్సీ నోట్లను చింపి, ముక్కలు చేసి బస్తాల్లో నింపి రోడ్డు పక్కన పడేశారు. ఈ ఘటన మేడ్చల్ పట్టణంలో బుధవారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రూ.2,000, రూ.500, రూ.100 కరెన్సీ నోట్లను గుర్తు పట్టలేని విధంగా చిన్న చిన్న ముక్కలుగా చింపి ప్లాస్టిక్ సంచుల్లో నింపి మేడ్చల్ పట్టణం కిష్టాపూర్ నుంచి మేడ్చల్ వైపు వస్తున్న రోడ్డు పక్కన పడేశారు. రోడ్డు పక్కన పడి ఉన్న బస్తాలను గమనించిన స్థానికులు బస్తాల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. కాగా, ఈ నోట్లు ఒరిజినల్.. లేక నకిలీవా తెలియాల్సి ఉంది. కాగా ఈ విషయం పట్ల పోలీసులకు గాని, అధికారులకు గాని ఎలాంటి సమాచారం లేక పోవడం గమనార్హం.

నందివాగులో రసాయన వ్యర్థాలు

- ఎర్రగా మారిన పంటపొలాలు
- చర్యలకు మేకవనంపల్లి, రాళ్లగూడుపల్లి రైతుల డిమాండ్


నందివాగులో రసాయన వ్యర్థాలతో కలుషితమైన నీరు

మోమిన్‌పేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివాగు ప్రాజెక్టు కింద ప్రవహిస్తున్న వాగులో నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు రసాయన వ్యర్థాలను ట్యాంకర్లలో తీసుకొచ్చి పారబోశారు. దీంతో కలుషితమైన వాగునీరు కాలువల ద్వారా ప్రవహిస్తూ పంట పొలాల్లోకి చేరడంతో పంటలకు ముప్పు ఏర్పడిందని స్థానిక రైతులు వాపోతున్నారు. అదే విధంగా మూగజీవాలు కలుషిత నీరు తాగి మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందివాగు ప్రాజెక్టు కాలువ నీటిని మేకవనంపల్లి గ్రామానికి చెందిన చాకలి వెంకటేశం పంట పొలానికి వినియోగించడంతో పొలం మొత్తం ఎర్రగా మారిపోయి దుర్గంధం వెదజల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. రసాయన వ్యర్థాలను పడేసిన గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసు అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మేకవనంపల్లి, రాళ్లగూడుపల్లి తదితర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తక్షణమే చర్యలు తీసుకోవాలి

నాలుగు రోజుల క్రితం రాళ్లగూడుపల్లి సమీపంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి పరీవాహక ప్రాంతంలో నీటికత్వలో గుర్తు తెలియని వ్యక్తులు రసాయన వ్యర్థాలను పారబోశారు. దీంతో వాగు నీరు ఎరుపు రంగులోకి మారి దుర్గంధం వెదజల్లుతోంది. మేకవనంపల్లిలో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేసేందుకు విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉంచాను. కానీ, ఈ కలుషిత నీటితో పొలం మొత్తం ఎర్రగా మారిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విష వ్యర్థాలు పడేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

-చాకలి వెంకటేశం, మేకవనంపల్లి

14న జాతీయ మెగా లోక్ అదాలత్

వికారాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లను కక్షిదారులు వినియోగించుకోవాలని చేసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న చిన్న కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి పంపకాల కేసులు, కుటుంబపర కేసులు, వైవాహిక జీవనం కేసులు, బ్యాంక్‌ల రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్‌బౌన్స్ తదితర కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందన్నారు. చిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరిగే కన్నా లోక్ అదాలత్‌లో వాటిని పరిష్కరించుకోవడం ఉత్తమమన్నారు. న్యాయ శాఖ ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి పార్టీలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తారన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని ఎస్పీ వివరించారు.


పంటలను పరిశీలిస్తున్న వీసీ రాజిరెడ్డి

క్రిమిసంహారక మందులను మోతాదుకు మించి వాడొద్దు

శామీర్‌పేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాగలో క్రిమిసంహారక మందులను మోతాదుకు మించి వాడొద్దని ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. పొన్నాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం, కూరగాయల పరిశోధన స్థానం ఆధ్వర్యంలో బుధవారం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పొన్నాల, బాబాగూడలను దత్తత తీసుకున్నామని, సేంద్రియ విధానంతో పంటలు సాగు చేయాలని చెప్పారు. రైతులందరూ ఐపీవోగా ఏర్పడి రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనవరి 2025లో సిద్దిపేట జిల్లా ములుగులో నిర్వహించే కిసాన్ మేళాలో రైతులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎ.భగవాన్, డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సురేశ్‌కుమార్, అనిత, శ్రీధర్, శిల్ప, నిఖిల్, రైతులు పాల్గొన్నారు.

కదలిన యంత్రాంగం

- ఫుడ్ పాయిజన్ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు
- అంగన్‌వాడీ, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి
- నిత్యం తనిఖీలతో చెక్ పెట్టేలా ప్రణాళిక

తాండూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తాండూరు గిరిజన ఆశ్రమ వసతి గృహంలో చోటు చేసుకున్న ఫుడ్ పాయిజన్ సంఘటనతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. బుధవారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు డీటీడీవో కమలాకర్ రెడ్డి, తాండూరు తహసీల్దార్ తారాసింగ్ హాస్టల్‌లోనే మకాం వేసి పరిస్థితిని సమీక్షించారు. ఫుడ్ పాయిజన్.. తాగు నీటి వల్ల జరిగిందా అనే అంశంపై ఆరా తీశారు. అలాగే మహిళా శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు అప్రమత్తమయ్యాయి. మరోవైపు రెవెన్యూ శాఖ బియ్యం సరఫరాపై దృష్టి సారించింది. అంగన్ వాడీ కేంద్రాలలో పిల్లలకు శుభ్రమైన పాత్రల్లో ఆహారం వండాలని, పిల్లలకు చేతులు కడిగి శుభ్రం చేయించాలని, అంగన్ వాడీ సెంటర్‌ల పరిసరాలను శుభ్రపరచాలని మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులు బుధవారం అంగన్‌వాడీలకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక తనిఖీలకు ఆదేశాలు

గిరిజన, షెడ్యుల్ కులాల, మైనార్టీ వసతి గృహాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం, పరిశుభ్రత, సౌకర్యాలు వంటి వాటిపై ఉన్నత స్థాయి అధికారులు మండల స్థాయి,

మిగతా 8వ పేజీలో...

హాస్టళ్ల నిర్వహణలో అశ్రద్ధ వద్దు

ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ శరత్

తాండూరు/తాండూరు రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వసతి గృహాలలో విధుల నిర్వహణలో అశ్రద్ధ వహించకూడదని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ శరత్ హెచ్చరించారు. బుధవారం ఆయన విద్యార్థులు అస్వస్థతకు గురైన తాండూరు గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వంట గదిని, స్టోర్ రూమ్, బియ్యాన్ని పరిశీలించి సంఘటన గురించి వార్డెన్ విశ్వకుమారి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి పరామర్శించారు. నాణ్యమైన భోజనాన్ని అందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని వార్డెన్‌ను ఆదేశించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చందన సర్పె, డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, తహసీల్దార్ తారాసింగ్, తదితరులు ఉన్నారు.

మూడు గంటల పాటు పరిశీలన

గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ మూడు గంటల పాటు గడిపారు. ప్రతి గదిని, తాగు నీటి ట్యాంకులను, వండే సామగ్రిని పరిశీలించారు. అలాగే అక్కడ ఉన్న ప్రతి విద్యార్థితో ముచ్చటించారు. అక్కడే ఉన్న పేరెంట్స్‌తో మాట్లాడి ఆధైర్య పడకూడదని చెప్పారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రతి పాఠశాలలో తాగు నీటిలో ఏదైన బ్యాక్టీరియా ఉంటే తెలుసుకోవడానికి అలాగే నీటి నాణ్యతను పరిశీలించేందుకు 12వేల హెచ్‌టూఎస్ టెస్ట్ వైల్ కొనుగోలు చేసినట్లు వివరించారు. హాస్టల్‌లో ఉన్న పిల్లలు తమ పిల్లలతో సమానమని కలెక్టర్ వివరించారు. తాండూరు హాస్టల్‌లో జరిగిన సంఘటన బాధకరమన్నారు. అన్నం సరిగ్గా ఉడకకపోవడంతో గ్యాస్ ట్రబులై అస్వస్థతకు గురైనట్లు గుర్తించామని ఆయన తెలిపారు.


హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్, కలెక్టర్ ప్రతీక్ జైన్

కోసిన పంటను కాపాడుకోవాలి

వర్షాలు పడే సమయంలో పత్తి తీయొద్దు
పొడి వాతావరణంలోనే వరిపంటను కోయాలి
నెలాఖరు వరకు జొన్న, మొక్కజొన్న,
పొద్దు తిరుగుడు విత్తనాలు విత్తుకోవచ్చు
రైతులకు డీఏవో నర్సింహారావు సూచనలు



వరిపంట కోస్తున్న కూలీలు, (ఇన్‌సెట్‌లో) డీఏవో నర్సింహారావు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రానున్న రెండు మూడు రోజులు చెదురు, ముదురు వర్షాలు కురిసే అవకాశలు ఉన్నందున రైతులు కోసిన పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కోసిన పంటలను వర్షానికి తడవకుండా మందస్తుగా సురక్షిత ప్రాంతానికి, మార్కెట్‌కు తరలించి టార్పాలిన్‌తో కప్పి ఉంచుకోవాలని తెలిపారు. వర్షాలు పడే సమయంలో పత్తి ఏరితే పంట నాణ్యత దెబ్బ తినే ప్రమాదం అధికంగా ఉంటుందన్నారు. పత్తి తడిసి నల్లగా మారి మంచి ధర రాకుండా పోతుందన్నారు. రైతులు ఎప్పటికప్పుడు మేఘాలను గమనిస్తూ వర్షం లేని సమయంలో మాత్రమే పత్తి తీయలని సూచించారు. శీతాకాలం కావడంతో ఉదయం మంచు ఎక్కువగా ఉంటుందన్నారు. అందుకే ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4, 5 గంటల మధ్య పత్తి తీసుకోవాలని సూచించారు. అధిక వర్షం, మంచుతో పగిలిన పత్తి కూడా రంగు మారి నాణ్యత దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉందని నర్సింహారావు తెలిపారు. ఎప్పటికప్పుడు పగిలిన కాయల నుండి పత్తి తీయడం మంచిదన్నారు. పూర్తిగా పగలని కాయల నుండి పత్తిని తీస్తే అది పూర్తిగా విప్పుకోక పోవడంతో ముడిపత్తి లాగా ఉంటుందన్నారు. దానిని నాణ్యమైన పత్తితో కలిపి మార్కెట్‌కు తరలిస్తే ధర తక్కువగా వస్తుందని తెలిపారు. పత్తి తీయగానే నీడలో వేయాలని, దీనివల్ల గింజ గట్టిపడి, అందులోని తేమ శాతం తగ్గి పత్తి శుభ్రంగా ఉంటుందని ఆయన తెలిపారు. లేకుంటే గింజలు ముడుచుకుపోయి పత్తి తూకం తగ్గడమే కాకుండా అందులో ముక్క పురుగులు చేరి నాణ్యత దెబ్బ తినే అవకాశ ముందని చెప్పారు. వరి పంటను కూడా పొడి వాతావరణం ఉన్నపుడు మాత్రమే కోయాలని, లేకుంటే గింజలు నాని మొలకెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. డిసెంబరు చివరి వరకు జొన్న, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు విత్తనాలను విత్తుకోవచ్చని తెలిపారు. వేరుశనగలో ఆకు ముడత వచ్చే అవకాశం ఉందన్నారు. శనగలో ఎండు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. దాని నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్స క్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు నేల పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సలహాల కోసం మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు సూచించారు.



పాఠశాలలో భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్

గొట్టిముక్ల పాఠశాలలో అధికారుల భోజనాలు

వికారాబాద్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) : వరుసగా వసతి గృహాల్లో విద్యార్థులు అస్వస్థకు గువుతుండడంతో అధికారులు వసతి గృహాలు, పాఠశాలలు, గురుకుల వసతిగృహాల బాట పట్టారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నీటి పరీక్షలు చేస్తూ విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉమ్రా యాత్రికులకు సెండాఫ్ ఇస్తున్న కుటుంబ సభ్యులు

ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి యాత్రికులు బుధవారం ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళ్లారు. మహ్మద్ ఫయాజ్ అలీ ఆధ్వర్యంలో 50 మంది ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి వెళ్లారు. ఎయిర్‌పోర్టులో వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఘనంగా వీడ్కోలు పలికారు. అంతకు ముందు మహ్మద్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ ఉమ్రా యాత్ర చేసుకోవడం ముస్లింలు పవిత్రంగా భావిస్తారని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యాభై మంది ప్రయాణికులు ఈ యాత్రకు వెళ్లారని చెప్పారు. వీరంతా 15 రోజుల్లో మక్కా, మదీనాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసుకుంటారని చెప్పారు.

రాంపూర్‌లో నేటినుంచి
లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న దేవాలయం, (ఇన్‌సెట్‌లో) స్వామివారి మూలవిరాట్

తలకొండపల్లి , డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాంపూర్‌లోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఈ దేవాలయంలో ప్రతి ఏటా వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 17 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక నేపథ్యంలో విశాల వసతులు కల్పిస్తున్నారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి స్నేహలత, చైర్మన్ జిల్లెల్ల పవన్ కుమార్‌రెడ్డిలు వివరించారు. గురువారం అంకురారోహణం, 13న ధ్వజారోహణం, 14న తిరుకల్యాణం, అన్నదానం, 15న భజన పోటీలు, రథోత్సవం, 16న దోపోత్సవం, బండ్లు తిరుగుట, 17న చక్రతీర్థం, గరుడ సేవ, నాగబలి కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా 13న భజన పోటీలు నిర్వహిస్తారని, ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతిగా రూ. 10,116, రెండవ బహుమతిగా రూ. 5,116, మూడవ బహుమతిగా రూ. 2,516 అందజేస్తారని తెలిపారు.

బాక్సింగ్ టోర్నమెంట్‌లో బలరాం ప్రతిభ



బలరాంను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నేనావత్ బలరాం తృతీయ బహుమతిని సాధించారు. నగరంలోని నిజాం కళాశాల బాక్సింగ్ హాల్లో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో 80 కేజీల విభాగంలో ఆయనకు ఈ బహుమతి లభించింది. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక, అధ్యాపకులు బలరాంను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో విజయం సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. చదువులతోపాటు ఇతర అంశాల్లో కూడా విద్యార్థులు నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఆమె సూచించారు.

ఆవిష్కరణల్లో తెలంగాణ ఆదర్శం



ఆవిష్కర్తల బృందంతో సుంకిరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యువత ఆవిష్కరణల్లో అద్భుతాలు సాధిస్తూ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తుందని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాలలో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జరుగుతున్న 8వ యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఐదుగురు తెలంగాణ యువ ఆవిష్కర్తల బృందంతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరపున వెళ్లిన యువ ఆవిష్కకర్తలు రూపొందించిన సాంకేతిక పరికరాలను సమ్మిట్‌లో ప్రదర్శించి వాటి తయారీ, ప్రయోజనాల గురించి వివరించినట్లు సుంకిరెడ్డి తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన : కసిరెడ్డి



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు , డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ సాహసోపేత నిర్ణయాలు, వినూత్న పథకాల అమలుతో తెలంగాణ పునర్వికాసం వైపు పయనిస్తోందన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, కల్వకుర్తి మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణంలో నూతనంగా నిర్మించే పోచమ్మ ఆలయ నిర్మాణానికి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. వివిధ మండలాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి పేదరిక నిర్మూలన, అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రగతిని చూసి విపక్షాలు జీర్ణించుకోలేక కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై విషం కక్కుతున్నాయని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ నెరవేరుస్తుందని చెప్పారు. పథకాల అమలులో తెలంగాణ దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ. 204 కోట్లు ఇప్పటికే మంజూరు చేశారని చెప్పారు. అలాగే పంచాయతీ రాజ్ ఆధీనంలోని రోడ్ల బీటీకి రూ.300కోట్ల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. కడ్తాల మండలం మైసిగండి , తలకొండపల్లి మండలం వెల్జాల దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు రూ.30 కోట్ల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్ ఎర్సన్లు యాట గీత, మనీల సంజీవ్ కుమార్, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యా నాయక్, ఆమనగల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ భట్టు కిషన్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు నరేశ్ నాయక్, రమేశ్, శ్రీశైలం, సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో పింఛన్ చెల్లింపుల రికార్డు తనిఖీ చేస్తున్న గోపాల్‌రావు

పింఛన్ సకాలంలో అందుతుందా?

» రాష్ట్ర సెర్ప్ అధికారుల ఆరా

తాండూరు రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై తెలుసుకునేందుకు రాష్ట్ర సెర్ప్ అధికారుల బృందం పర్యటించింది. బుధవారం కొత్లాపూర్, బెల్కటూర్ గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 6వేల మంది పింఛన్‌దారులకు నెలనెలా రూ.85లక్షల పెన్షన్ పంపిణీ చేస్తున్నామని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అధికారులకు తెలిపారు. పెన్షన్ డబ్బును పంచాయతీ కార్యదర్శులతో పంపిణీ చేయిస్తున్నామని వివరించారు. చనిపోయిన వారి పేర్లను వెబ్‌సైట్ నుంచి తొలగించారా? వారి స్థానంలో కొత్త వారికి పింఛన్ ఇస్తున్నారా? అని అధికారులు ఆరా తీశారు. కొందరి ఫింగర్‌ప్రింట్ సరిగా రాక వారి పింఛన్ ఆగుతోందని, కార్యదర్శులే డబ్బు ఇస్తున్నారని వృద్ధులు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా జీవనోపాధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, డీఆర్డీవో, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.



సంస్థతో ఒప్పంద చేసుకుంటున్న కళాశాల యాజమాన్యం

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్(కేపీఆర్ఐటీ) కళాశాల వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఘనపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ టీఎస్ఎస్ఐఎఫ్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎప్పటికప్పుడు వృత్తి, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. టీఎస్ఎస్ఐఎఫ్‌తో చేసుకున్న ఒప్పందంతో భవిష్యత్తులో విద్యార్థులకు మేలు జరుగుతుందని, ఉద్యోగావకాశాలలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఐఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ రూపా బోహ్రా, కేపీఆర్ఐటీ డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ రవీంద్ర పాల్గొన్నారు.

డీఎల్‌పీవో కార్యాలయం ప్రారంభం



ఆఫీసును ప్రారంభిస్తున్న డీఎల్‌పీవో శంకర్‌నాయక్

తాండూరు రూరల్, డిసెంబర్ 11(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిషత్ ఆవరణలోని పాత భవనానికి రంగులేసి డీఎల్‌పీవో కార్యాలయంగా మార్చారు. బుధవారం డీఎల్‌పీవో శంకర్‌నాయక్, ఎంపీడీవో విశ్వప్రసాద్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇకపై తాండూరు, యాలాల, పెద్దేముల్, తాండూరు మండలాల కార్యక్రమాలు ఈ కార్యాలయం ద్వారా నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవోను పంచాయతీ అధికారులు, కార్యదర్శులు సన్మానించారు.



టాస్కా డైరీ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వయోధికుల హక్కులను పరిరక్షించాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజెన్ అసోసియేషన్(టాస్కా) డైరీని కొర్రెములలోని సుప్రభాత్ కాలనీలో బుధవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బండారి రాజయ్య, ప్రధాన కార్యదర్శి ఎ.వేణుమాధవ్ మాట్లాడుతూ.. వయోధికులకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో బస్సు చార్జీల్లో ఇస్తున్న రాయితీని తెలంగాణలోనూ ఇవ్వాలని కోరారు. వయోధికుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, కుటుంబ సభ్యుల హింసను అరికట్టాలన్నారు. అనంతరం అసోసియేషన్ 2025 డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కంచె టీరయ్య, జాయింట్ సెక్రటరీ రాజనర్సు, శ్రీనివాస్, సభ్యులు మల్లయ్య, ప్రభాకర్, ప్రతాప్‌సింగ్, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, వెంకట్‌రెడ్డి, సర్జిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె బాటలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

» మూతపడిన మండల విద్యావనరుల కేంద్రం



మూతపడిన విద్యావనరుల కేంద్రం

మోమిన్‌పేట్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు కొన్ని రోజులుగా సమ్మెలో ఉన్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రధానంగా వారు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగులు, సిబ్బంది రాక మండల విద్యావనరుల కేంద్రం మూతపడింది. ఈ నేపథ్యంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ బుధవారం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎస్ఎస్ఏలో కాంట్రాక్ట్ ప్రాతిపదికపై పనిచేస్తున్న ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. లేదంటే సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తామని ఆయన అన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు

ఆమనగల్లు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపాలన కొనసాగిస్తోందని బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రసాద్‌లు ఆరోపించారు. కాంగ్రెస్ మోసాలను ఎండగడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. రాంనుంతలలో బుధవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలపై సమావేశంలో చర్చించారు. గ్రామ 171వ బూత్ కమిటీ అధ్యక్షుడు గావరికుప్పల గిరిధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణలో బీజేపీ ప్రత్యమ్నాయ శక్తిగా నిలుస్తుందన్నారు. ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని నర్సింహ, ప్రసాద్‌లు తెలిపారు. మల్లేశ్, రమేశ్, రవి, శేఖర్, ఈశ్వర్, వెంకటేశ్, రవి, నర్సింహ, శ్రీకాంత్, పవన్, కృష్ణ, గోపాల్, శ్రీనివాస్, జయంత్, రాజు, తదితరులున్నారు.

సామాజిక తనిఖీకి సహకరించాలి

కొత్తూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీకి కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది సహకరించాలని ఎంపీడీవో అరుంధతి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో 7వ విడత తనిఖీ నిమిత్తం వచ్చిన ఎస్‌ఆర్పీ, బీఆర్పీలు, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈనెల 12, 13వ తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం పర్యటిస్తుందని, అందరూ సహకరించాలని కోరారు.

అయ్యప్ప కొండపై ప్రత్యేక పూజలు

కులకచర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కులకచర్ల అయ్యప్ప కొండపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఏకాదశి అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా స్వామివారికి భక్తులు అభిషేకం నిర్వహించారు. గురుస్వాములు సతీశ్‌కుమార్, ఈశ్వరయ్య, వెంకట్రామ్‌రెడ్డి, రాజయ్య, రాములుగౌడ్, చంద్రశేఖర్, శివకుమార్, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప కొండ అయ్యప్ప నామస్మరణతో మర్మోగింది. ఈ నెల 18న ఇక్కడ అయ్యప్ప మహాపడి పూజ, గణపతి హోమం, కుంబాభిషేకం నిర్వహిస్తామని స్వాములు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులతో మాట్లాడి వివరాల సేకరణ.. హాస్టళ్లను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



బొట్లవనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతీక్‌జైన్ హెచ్చరించారు. ఆయన బుధవారం బొంరాస్‌పేట్ మండలం బొట్లవనితండాలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించే సమయంలో ఏజెన్సీ నిర్వాహకులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. బియ్యం బాగా లేకపోతే తిరిగి పంపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్నగౌడ్, ప్రిన్సిపాల్ విక్రంసింగ్ రాథోడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

చేతులను శుభ్రం చేసుకోవాలి

పరిగి రూరల్: వంట చేసే సమయంలో అలాగే ఆహారం వడ్డించేటపుడు నిర్వాహకులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. బుధవారం పరిగి మండల కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాల, మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిని, బియ్యాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా సదుపాయాలు కల్పిస్తూనే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో ఎం.ఏ.కరీం, వసతి గృహాల ప్రిన్సిపాల్స్ హరిత, ఉమా సుజాతలు ఉన్నారు.

16 నుంచి సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎం కప్-24 జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని జిల్లా యువజన క్రీడల అధికారి గోపాల్‌రావు బుధవారం తెలిపారు. 16న హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో యోగా, చెస్, జూడో, హ్యాండ్‌బాల్ పోటీలు, కీసర ఓఆర్ఆర్ రోడ్డులో సైక్లింగ్, 17న హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, ఓల్డ్ అల్వాల్‌లోని వీవీరావు స్పోర్ట్స్ అకాడమిలో స్విమ్మింగ్ పోటీలు, 18న హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో కబడ్డీ, అథ్లెటిక్స్, ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో బ్యాడ్మింటన్, ఉప్పల్ జడ్పీహెచ్ఎస్‌లో కిక్ బాక్సింగ్, అల్వాల్ పల్లవి స్కూల్‌లో నెట్‌బాల్ సెలక్షన్స్ ఉంటాయన్నారు. 19న జింఖాన గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ సెలక్షన్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి మెరిట్ సర్టిఫికెట్స్‌తో పాటు పాల్గొన్న క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో విజేతలైన క్రీడాకారులను ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొనే వారు ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమో, రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9912770801, 7660919518 అనే నంబర్లలో సంప్రదించాలన్నారు.

పొలం బురదలో యువతి మృతదేహం

» అత్యాచారం, హత్య చేసి ఉంటారని అనుమానం

» మృతురాలు మధ్యప్రదేశ్ వాసి

» దర్యాప్తు చేస్తున్న షాద్‌నగర్ పోలీసులు

షాద్‌నగర్‌రూరల్ డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): యువతిపై అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చటాన్‌పల్లి శివారులో ఆలస్యంగా వెలుగు చూసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన యువతి(24) చటాన్‌పల్లి శివారులో ఉన్న చాక్లెట్ పరిశ్రమలో పనిచేస్తూ చటాన్‌పల్లిలో ఓ అద్దె ఇంట్లో నివాసముంటుంది. గత నెల 29న పరిశ్రమకు వెళ్లకుండా రూములోనే ఉండిపోయింది. అదే రోజు సాయంత్రం నుంచి ఆమె కనిపించకుండా పోవడంతో తనతోపాటు ఉంటున్న మరో యువతి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. మరుసటి రోజు కనిపించకుండా పోయిన యువతి పెద్దమ్మ కుమారుడు రాకేష్ కుమార్ షాద్‌నగర్‌కు వచ్చాడు. తెలిసినవారి దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 5న షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం చటాన్‌పల్లి శివారులోని ఓ వ్యవసాయ పొలంలో మహిళ మృతదేహం ఉందని పోలీసులకు రైతులు సమాచారం ఇచ్చారు. పోలీసులు రాకేష్ కుమార్‌ను పొలం వద్దకు తీసుకెళ్లి మృతదేహాన్ని చూపించారు. మృత దేహం తన సోదరిదేనని అతను తెలిపాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన సంజయ్ అనే యువకుడిపై అనుమానం ఉందని మృతురాలి సోదరుడు పోలీసులకు చెప్పాడు. అతను కూడ అదే పరిశ్రమలో పని చేస్తాడని తెలిపారు. అయితే యువతి మిస్సింగ్ అయిన రోజు సంజయ్ కూడా పరిశ్రమకు వెళ్లలేదని తెలిసింది. అతడికి కాల్ చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని తెలిపారు. అయితే అత్యాచారం చేసి హత్య చేసినట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



గోశాలను సందర్శించిన స్వామి

గోశాల సందర్శన

కులకచర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆలయాల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు స్వామి అన్నారు. బుధవారం ఘనపూర్ శివరామలింగేశ్వర గోశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పురాతన ఆలయాలు మన సంస్కృతి ప్రతిబింబాలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణలో ఆలయాల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, పరిగి పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, కొండ నర్సిములు, హరికృష్ణ, మహేందర్, ఏబీవీపీ నాయకులు మహేశ్, శ్రీశైలం, శివరాములు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా బ్లాస్టింగ్‌లు చేస్తే చర్యలు



క్రషర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, పోలీసు సిబ్బంది

మర్పల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా భారీ పేలుళ్లు జరిపితే చర్యలు తప్పవని తహసీల్దార్ మునీరుద్దీన్, ఎస్సై సురేశ్ హెచ్చరించారు. పట్లూర్‌లో క్రషర్ మిషన్‌తో బ్లాస్టింగ్ చేస్తున్నారనే ఫిర్యాదుతో బుధవారం క్రషర్‌ను పరిశీలించారు. పేలుడు పదార్థాలు ఉన్నాయేమోనని ఆరా తీశారు. అక్కడున్న వారితో బ్లాస్టింగ్‌లకు అనుమతులను చూపాలన్నారు. అక్రమ పేలుళ్లతో ప్రజల ప్రాణాలు, ఆస్తికి నష్టం జరుగుతుందని అన్నారు. బ్లాస్టింగ్‌లు జరిపితే చర్యలు తప్పవన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

ఆడబిడ్డ వివాహానికి పుస్తె, మెట్టెలు అందజేసిన ముస్లిం



పుస్తె, మెట్టెలను అందిస్తున్న సాజిద్

కేశంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మతసామరస్యం పరిమళించింది. హిందూ ఆడబిడ్డ వివాహానికి ఓ ముస్లిం వ్యక్తి పుస్తె, మెట్టెలు అందజేసి ఉదారతను చాటుకున్నాడు. మండలంలోని సంతాపూర్ గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు సాజిద్ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుంటాడు. ఈమేరకు బుధవారం గ్రామానికి చెందిన ల్యాగలకాడి నర్సింహ-అనురాధ దంపతుల కూతురు శిరీష వివాహానికి తన వంతుగా పుస్తె, మెట్టెలను అందజేశాడు. హిందూ మహిళ పెళ్లికి పుస్తె, మెట్టెలు అందించిన సాజిద్‌ను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో భద్రప్ప, సాయిరెడ్డి, జంగయ్య, అరవింద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

41వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకోసం తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామస్థులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం 41వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు మద్దతుగా జేఏసీ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రాన్ని ప్రకటించే వరకూ పోరాటం కొనసాగిస్తామని జేఏసీ చైర్మన్ ముకురాల అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులు తెల్పి చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మండల కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా సహకరించాలని కోరారు. దీక్షలో నాయకులు ఆంజనేయులు, కొండల్‌గౌడ్, వినోద్‌బాబు, పాండు, వంశీ, ప్రశాంత్, వెంకటేశ్, మల్లయ్య, యాదయ్య, జంగయ్య, రామచంద్రి తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

విద్య, వైద్యరంగాలకు పెద్దపీట

» మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



ఆసుపత్రిలో సమస్యలపై వైద్యులను అడిగి తెలుసుకుంటున్న కేఎల్లార్

మహేశ్వరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో విద్య, వైద్యరంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) అన్నారు. బుధవారం మహేశ్వరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు పాఠశాలలు, వసతి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విద్య, వైద్య రంగాలను గాలికొదిలేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మౌలిక సదుపాయాల్లో ముఖ్యమైనవి విద్య, వైద్యమేనని అన్నారు. కేసీఆర్ పాలనలో ఇవి పేదలకు ఏమాత్రం అందుబాటులో లేకుండా పోయాయన్నారు. మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ఈ సందర్భంగా వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డయాలసిస్ యంత్రాలు తక్కువగా ఉన్నాయని తెలుసుకున్న ఆయన వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పాఠశాలలు, వసతి గృహాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని స్థానిక కాంగ్రెస్ నాయకులతో పాటు ఉపాధ్యాయులకు సూచించారు. ఏనుగు జంగారెడ్డి, కాకి ఈశ్వర్, ఇజ్రాయేలు, రాఘవేందర్‌రెడ్డి, లాజర్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవో సర్దార్ నాయక్‌ను సన్మానిస్తున్న నూతన ఎంఈవో సత్యనారాయణ, నాయకులు

సేవలను బట్టే ప్రజల్లో కీర్తి

కడ్తాల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పనితీరును బట్టే ప్రజల్లో కీర్తి లభిస్తుందని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. కడ్తాల మండల విద్యాశాఖ అధికారిగా నాలుగేళ్ల విధులు నిర్వహించి ఇటీవల మాడ్గులకు బదిలీ అయిన సర్దార్‌నాయక్‌కు బుధవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సర్దార్‌నాయక్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. మండలానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు కాశీరావు, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు జంగయ్య, నాయకులు మహేశ్, నర్సింహ్మా, రాంచంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

యాచారం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలై బంగారం లాంటి జీవితాలను పాడు చేసుకోరాదని, గంజాయి, డ్రగ్స్ వాడిన వారిపై పోలీసులు పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తారని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లి జంగయ్య, ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు విప్లవ్‌కుమార్‌లు అన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై వాడితే రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బుధవారం మండలంలోని మాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి వద్దు ఆరోగ్యమే ముద్దు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. భగత్‌సింగ్, ఆజాద్ చంద్రశేఖర్‌ల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రథమ లక్ష్యం: వీర్లపల్లి



అంబులెన్స్ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే రాష్ట్ర ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం చౌదరిగూడ, నందిగామ మండలాలకు రూ.24లక్షలతో ప్రభుత్వం మంజూరు చేసిన అంబులెన్స్ వాహనాలను క్యాంపు కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు.

మహిళలతోనే గ్రామాల అభివృద్ధి

మహిళలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్, కేశంపేట మండలాలకు చెందిన లబ్దిదారులకు రూ.24.25లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. అలాగే క్రీడలతోనే యువతలో స్నేహపూర్వక సంబంధాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే శంకర్ వ్యాఖ్యానించారు. షాద్‌నగర్, చౌదరిగూడ, కేశంపేట మండలాల్లో సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబార్ ఖాన్, నేతలు బాలరాజుగౌడ్, చెంది తిరుపతిరెడ్డి కొంకళ్ల చెన్నయ్య, అగ్గనూరు బస్వం తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పాలమూరు బస్సులు షాద్‌నగర్ మీదుగా నడపాలి

ఉమ్మడి పాలమూరు జిల్లా బస్సులు బైపాస్ మీదుగా కాకుండా షాద్‌నగర్ పట్టణం మీదుగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ఆర్ఎంతో మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ బైపాస్ మీదుగానే వెళ్లడం వల్ల షాద్‌నగర్ ప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో అన్నారం చౌరస్తా మీదుగా షాద్‌నగర్ వెళ్లేందుకు రోడ్డు బాగాలేనందున రాత్రిపూట వెళ్లే బస్సులను మాత్రమే బైపాస్ మీదుగా వెళ్లేందుకు అధికారులు అనుమతించారని, దీన్ని ఆసరాగా చేసుకుని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బస్సులు పగటి వేళలో కూడా బైపాస్ మీదుగా ఎందుకు వెళ్తున్నాయని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా బస్సులను షాద్‌నగర్ మీదుగా నడపాలని ఆర్ఎంను కోరారు. ఆయన కూడా ప్రతీ బస్సు షాద్‌నగర్ మీదుగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఐనెల్లి స్కూల్‌లో వంటగది లేక ఇక్కట్లు



స్కూల్, కాలేజీ ప్రాంగణంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంట గది

తాండూరు రూరల్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనెల్లిలో గల ఆదర్శ పాఠశాలలో వంట గదిలేక వంట నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న ఒక్క వంట గదీ కూలుతుండడతో దానిలో వంట చేసే పరిస్థితి లేకుండా పోతోంది. లక్షలు ఖర్చు చేసి ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దినా స్కూలుకు వంట గది నిర్మించకపోవడం సరికాదని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. తాత్కాలిక షెడ్డులో మహిళలు వంట చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు 504 మంది విద్యార్థులు, అలాగే ఇంటర్మీడియట్‌లో 240 మంది మొత్తం 744మంది చదువుకుంటున్నారు. వంటగది లేక శిథిలావస్థలో ఉన్న షెడ్డులోనే వంట చేస్తూ కాలం వెళ్ల దీస్తున్నారు. వంట సామగ్రికి రక్షణకూడా లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ హైస్కూల్‌కు వెంటనే కిచెన్ షెడ్డును మంజూరు చేసి త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేయించి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

హాస్టల్ వద్ద బీజేపీ నాయకుల ఆందోళన

తాండూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం సాయిపూర్‌లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఎస్టీ బాలికల హాస్టల్ వద్ద బీజేపీ నాయకులు బుధవారం ఆందోళన చేశారు. అదే సమయంలో కలెక్టర్ వచ్చారు. దీంతో నాయకులు కలెక్టర్‌ను అడ్డుకున్నారు. విద్యార్థినులకు చికిత్స చేసే విధానంపై నాయకులు అభ్యంతరం తెలిపారు. ఇక్కడే చికిత్స చేయించడం ఏమిటని, ఆస్పత్రిలో చేర్పించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ నాయకులను సముదాయించారు. మెరుగైన చికిత్సను అందిస్తామని చెప్పారు. నిసరన కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌కుమార్, నాయకురాళ్లు శ్రీలత, అంతారం లలిత, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశం పాల్గొన్నారు. కాగా విద్యార్థినులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్వప్న పరామర్శించారు. సంఘటనపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు కొబ్బరి బోండాలను తాగించారు. ఆమెతో కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, వెంకన్న, రవి ఉన్నారు. అలాగు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశంతో హాస్టల్‌ను తాండూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పి.బాల్‌రెడ్డి, కౌన్సిలర్ నీరజ సందర్శించారు. విద్యార్థినులకు అందుతున్న వైద్య చికిత్సపై అడిగి తెలుసుకున్నారు. పరిస్థితిపై ఎమ్మెల్యేకు వివరించారు. ప్రస్తుతం విద్యార్థినులంతా కోలుకుంటున్నారని చెప్పారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

కొడంగల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్‌లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్‌లు సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నాయకులు మాట్లాడారు. 12న హైదరాబాద్‌లో జరిగే అంగన్‌వాడీల ధర్నాపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి హత్య



మహిపాల్ మృతదేహం

కీసర రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు హత్యకు గురైన ఈ ఘటన బుధవారం కీసర మండలంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హరిదాసుపల్లి నుంచి దమ్మాయిగూడ వెళ్లే మార్గంలో డంప్ యార్డు సమీపంలో ఓ యువకుడి మృతదేహం పడి ఉందని పోలీసులకు సమాచారమొచ్చింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా యువకుడు రక్తపు మడుగులో చనిపోయి ఉన్నా డు. అతడిని కాప్రా మండలం ఎల్లారెడ్డిగూడకు చెందిన చిరమైన మహిపాల్(26)గా గుర్తించారు. మహిపాల్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ప్రేమ వ్యవహారమే హత్యకు దారి తీసిందని తెలుస్తోంది.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య



యాదగిరి(ఫైల్)

కులకచర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలం వీరాపూర్‌లో చెట్టుకు ఉరేసుకున్న స్థితిలో గాలి యాదగిరి(23) అనే యువకుడు బుధవారం మృతిచెందాడు. మంగళవారం గ్రామంలో పెద్దలు పంచాయితీ పెట్టారు. గ్రామానికి చెందిన ఓ యువతి(19) గర్భధారణకు యాదగిరే కారణమని, ఆమెను పెళ్లి చేసుకోవాలని గ్రామస్తులు తీర్పు చెప్పారు. ఇందుకు రెండు రోజుల గడువిచ్చారు. ఆ యువతితో తనకు సంబంధం లేదని, తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని యాదగిరి మనస్థాపానికి గురై ఇంటి వెనక ఉన్న చింత చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యాదగిరి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు. కాగా యాదగిరి మరణవార్త తెలియగానే సదరు యువతి సైతం పురుగుల మందు తాగగా ఆమెను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

రూ.2.25లక్షల విలువైన గంజాయి స్వాధీనం

● పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు



గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నిందితులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):మేడ్చల్ ప్రాంతంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఐదుగురిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు పట్టుకుని రూ.2.25లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బి-టీమ్ సీఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి ప్రాంతానికి చెందిన దీపక్‌కుమార్, షరీఫ్, ఇస్మాయిల్ గుండ్లపోచంపల్లి, దుండిగల్ ప్రాంతాల్లో కాలేజీల విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్నారు. మంగళవారం రాత్రి వారిని అదుపులో తీసుకొని ఏడున్నర కిలోల గంజాయి లభించిందన్నారు. అలాగే మేడ్చల్ చెక్‌పోస్టు సమీపంలో బిహార్‌కు చెందిన మిలన్‌కుమార్, మనీష్‌కుమార్,అఖిలేష్‌కుమార్ల నుంచి 1.13కిలోల గంజాయి లభించిందని తెలిపారు. రెండు కేసుల్లో ఐదుగురిని అదుపులో తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు, పారిశ్రామిక వాడలో పనిచేసే కూలీలు, జాతీయ రహదారిపై వాహనాలు తరలించే డ్రైవర్లను లక్ష్యంగా పెట్టుకుని వీరు గంజాయి అమ్మకాలు జరుపుతున్నారని సీఐ సుభాష్ తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బొంరాస్‌పేట్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పట్టుకున్నట్టు ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు. బుధవారం మహంతిపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను కొడంగల్‌కు తరలిస్తుండగా నాగిరెడ్డిపల్లి రైసుమిల్లు వద్ద పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై ట్రాక్టర్ల డ్రైవర్‌లు శివకుమార్, సుదర్శన్, లాలప్ప, రవి, నర్సిములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆభరణాలను జాగ్రత్త పర్చుకోవాలి

మోమిన్‌పేట్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు ప్రయాణం చేసే సమయంలో సెల్‌ఫోన్‌లు, బంగారు అభరణాల పట్ల అప్రమత్తంగా ఉండి వాటిని జాగ్రత్తపర్చుకోవాలని ఏఎస్సై పుండరీకం సూచించారు. బుధవారం మోమిన్‌పేట్ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. బస్సులు ఎక్కేముందు, దిగేముందు జాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమానితులుంటే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురి కాకుండా చూసుకోవాలని, తెలియని లింక్‌లను క్లిక్ చేయొద్దన్నారు. పోలీసు సిబ్బంది మణిమాల, దత్తాత్రి, శ్రీశైలం పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



శిక్షణలో పాల్గొన్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

తాండూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో రెండు రోజులు నిర్వహించే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఓరియంటేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు పాల్గొన్నారు. బుధవారం శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సభా వ్యవహారాలపై శిక్షణ ఇస్తున్నారు. గురువారంతో శిక్షణ ముగియనుంది.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కొడంగల్ రూరల్: రావులపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్/మర్పల్లి/దౌల్తాబాద్/మోమిన్‌పేట్/బషీరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద నాణ్యమైన, రుచికరమైన భోజనం అందివ్వాలని కొడంగల్ తహసీల్దార్ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం రావులపల్లిలో జెడ్పీప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో భోజనాన్ని ఎంఈఓ, ఎంపీడీవోలతో కలిసి పరిశీలించారు. వంటకు వాడుతున్న బియ్యం నాణ్యతను చూశారు. కిచన్ షెడ్‌లను, పాఠశాల పరిసరాలు, మరుగుదోడ్లు, తాగునీటి వసతులను పరిశీలించారు. భోజనం నాణ్యత, రుచికరంగా ఉండాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీవో ఉషశ్రీ, ఎంఈఓ రాంరెడ్డి, హెచ్‌ఎంలు ఉన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు తప్పవని మర్పల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య అన్నారు. మర్పల్లిలోని ఎస్టీ హాస్టల్‌ను తనిఖీ చేశారు.

11కెడియల్10: మధ్యాహ్న భోజనం బియ్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా ట్రైనీ అడిషనల్ కలెక్టర్ ఉమాహారతి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా ట్రైనీ అడిషనల్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. బుధవారం దౌల్తాబాద్‌లోని బీసీ హాస్టల్‌ను, బాలంపేట కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట ఎంఈవో వెంకటస్వామి, ఉపాధ్యాయులు ఉన్నారు. మోమిన్‌పేట్ మండలం మేకవనంపల్లి జడ్పీహెచ్‌ఎస్, యూపీఎస్, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో విజయలక్ష్మి తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. స్టోర్ రూంలలో బియ్యం, వంట సామగ్రిని పరిశీలఇంచారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, ఆర్‌ఐ గోవర్ధన్, ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్, వంట మహిళలు పాల్గొన్నారు. పాఠశాలల్లోని ఉన్న పాత బియ్యాన్ని పంచాయతీ కార్యదర్శులకు అప్పగించాలని బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేష్ సూచించారు. బషీరాబాద్‌లోని పాఠశాలలను తనిఖీ చేసి బియ్యాన్ని పరిశీలించారు. నవంబరు వచ్చిన బియ్యాన్నే వాడాలని సూచించారు. వంట చేసే ప్రాంతం, పాఠశాల ఆవరణ, పి ల్లలు భోజనం చేసే ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. పాఠశాలల హెచ్‌ఎంలు, వంట వండే వారు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేం దుకు కృషిచేయాలని సూచించారు.



మోమిన్‌పేట్: మేకవనంపల్లి పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

క్రీడల్లో ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు



బండవెల్కిచర్లలో సీఎం కప్ క్రీడాకారులతో సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య తదితరులు

కులకచర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించేందుకే సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నా మని సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. బండవెల్కిచర్ల ఎస్టీ బాలుర గురుకులంలో బుధవారం మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.గురువారం కూడా క్రీడలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ మురళీధర్, ఎంఈవో హబీబ్, ఎంపీవో భాస్కర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, స్వామి, మహిపాల్‌రెడ్డి, వెంకటయ్యగౌ డ్, హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో సీఎం కప్ పోటీలు కొనసాగాయి. రెండో రోజు పోటీలను ఎంపీడీవో వెంకన్నగౌడ్, ఎంఈవో హరిలాల్ ప్రారంభించారు. వాలీబాల్, షార్ట్ పుట్ పోటీలు ని ర్వహించారు. కార్యక్రమాన్ని టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీ ందర్‌గౌడ్, పీడీలు గోపాల్, మహేశ్, శ్రీకాంత్, టీచర్లు గోపాల్, మల్లయ్య, చంద్రశేఖర్ తదితరులు పర్యవేక్షించారు.

మేడ్చల్ టౌన్:గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీస్తేనే వారు అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తారని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ డి. మల్లికార్జున్ అన్నారు. ముఖ్యమంత్రి క్రికెట్ టోర్నీలో భాగంగా బుధవారం కౌన్సిలర్ల తరపున ఆరు టీంలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీడీవో

తాండూరు రూరల్: తాండూరులోని సెయింట్ మార్క్స్ జూబ్లీ స్కూల్ గ్రౌండ్‌లో మండల సీఎం కప్ పోటీలకు ఏర్పాట్లు చేశారు. బుధవారం స్కూల్ గ్రౌండ్‌లో పీఈటీలు ఆటల కోసం కావాల్సిన కోర్టులను సిద్ధం చేశారు. ఎంపీడీవో విశ్వప్రసాద్ పరిశీలించారు. మండలంలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని, ఈ పోటీల్లో రాణించిన వారికి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.



గ్రౌండ్ సిద్ధం చేస్తున్న పీఈటీలు

కదలిన యంత్రాంగం



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు డాక్టర్ శరత్, ప్రతీక్‌జైన్

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక తనిఖీలకు నిర్ణయించినట్లు సమాచారం. పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్‌లో కమిషనర్లకు తనిఖీ బాధ్యతలు అప్పగించి ప్రత్యేక నివేదికను తీసుకోనున్నారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా చాలా చోట్ల భోజనం, ఇతర సౌకర్యాలు లేవని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు సంఘటనలు జరిగిన సమయంలోనే కాకుండా ముందస్తుగా స్పందిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఫిర్యాదులు అందిన సమయంలో వెంటనే మండల అధికారులు స్పందించాలని ఎప్పటికప్పుడు మానిటరింగ్ ఉండాలని కోరుతున్నారు.

కొత్త బియ్యంతో ముద్దగా అన్నం

బషీరాబాద్ మండలంలో గత నెలలో మధ్యాహ్న భోజనానికి కొత్త బియ్యం ఇవ్వడంతో ఇబ్బందులు వస్తున్నాయని హెచ్‌ఎంలు తహసీల్దార్ వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు.15రోజులు దాటినా ఆ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ మార్చలేదన్నారు. కొత్త బియ్యంతో అన్నం వండితే ముద్ద అవుతోందని హెచ్‌ఎంలు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. విషయాన్ని తహసీల్దార్ పౌరసరఫరాల అధికారులకు తెలిపినా స్పందన లేదు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

కొడంగల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కృష్ణంరాజును మైనారిటీ నాయకులు ఎస్‌ఎం.గౌసన్ ఆధ్వర్యంలో సన్మానించారు. బుధవారం కొడంగల్‌లో వారిని శాలువాలతో సన్మానించారు.

యాప్‌పై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

దోమ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషన్ ట్రాకర్ అప్లికేషన్ యాప్ వాడకంపై అంగన్‌వాడీ టీచర్‌లకు శిక్షణ నిర్వహించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలకు పౌష్టికాహారం గుడ్లు, పాలు తదితర వాటిని సక్రమంగా అందించాలని ఎంపీడీవో మహేశ్‌బాబు టీచర్లకు సూచించారు. గడువు ముగిసిన వస్తువులను తిరిగి పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీవో సోమలింగం, సూపర్‌వైజర్‌లు ఉజ్వలరాణి, జగనన్న, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

గృహయోగం!

(5వ పేజీ తరువాయి)

బాధ్యులను చేయనున్నారు. క్షేత్ర స్థాయి సర్వే ప్రక్రియను మండలాల్లో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు పర్యవేక్షించనున్నారు.

ప్రస్తుత స్థితిని తెలిపేలా ఫొటోలు

లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ రూపొందించింది. ఈ యాప్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల ఆధారంగా పూర్తి సమాచారం సేకరించి పొందుపరచనున్నారు. ఇందుకోసం సర్వేయర్లకు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు ఇచ్చి శిక్షణ పూర్తి చేశారు. యాప్‌లో పొందుపరిచిన వివరాల ఆధారంగా ఇంటింటికి తిరిగి సర్వే చేయనున్నారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇల్లు సొంతమా? అద్దెనా? ఇంటి నిర్మాణం కోసం స్థలం ఉందా? లేదా? వివరాలను తెలుసుకోనున్నారు. ప్రస్తుత నివాసం ఉండే ఇంటి వద్ద దరఖాస్తుదారునికి సంబంధించిన మూడు ఫొటోలను తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దరఖాస్తుదారు ప్రస్తుతం నివాసం ఉన్న ఇంటి ఎదుట నిలుచోబెట్టి ఒకటి, ఇల్లు కనిపించేలా మరొకటి, ఖాళీ స్థలం ఫొటో ఒకటి తీస్తారు. దరఖాస్తుదారుల కుటుంబ సభ్యులతో కలిపి ఇంటి స్వభావం తెలిసే విధంగా మరో ఫొటో తీస్తారు. ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న వారు కూడా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇలాంటి వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయరు. ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఉండే ఖాళీ స్థలానికి జియో ట్యాగింగ్ చేస్తారు.

గుడిసెల్లో ఉండేవారికి ప్రాధాన్యం

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేసి.. వాటిని నాలుగు దశల్లో చెల్లింపులు చేయనున్నారు. పూరి గుడిసెలు, శిథిలావస్థకుచేరిన ఇళ్లు, రేకుల ఇల్లు, పెంకుటిల్లు, అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న దరఖాస్తుదారుల వద్దకు అధికారులు వెళ్లనున్నారు. కాగా, పూరి గుడిసెలు, శిథిలావస్థ ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. సర్వే నిర్వహించే సమయంలో మొత్తం 35 అంశాలకు సంబంధించిన సమాచారం దరఖాస్తుదారుడి నుంచి తెలుసుకుని యాప్‌లో నమోదు చేయనున్నారు. గతంలో ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధిపొందారా? అనే వివరాలను తెలుసుకుని నమోదు చేస్తారు. దరఖాస్తుదారుల కుటుంబంలో ఒంటరి మహిళ, దివ్యాంగులు, వితంతు వంటి ప్రభుత్వం గుర్తించిన ప్రత్యేకతలు కలిగిన వారుంటే వారి వివరాలను సేకరించనున్నారు.

సాంకేతిక సమస్యలు తలెత్తకుండా..

ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరు చేయనుంది. మొదట సొంత స్థలమున్న నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇళ్లు మంజూరయ్యే వారికి ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అనుమతులు మహిళల పేరిట జారీ చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇందిరమ్మ యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేయనున్నారు.

నిత్యం గీతాపారాయణం చేయాలి



వికారాబాద్ శివాజీనగర్‌లో గీతా పారాయణం చదువుతున్న మహిళలు

వికారాబాద్/మోమిన్‌పేట్/పరిగి రూరల్/ధారూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గీతా పారాయణాన్ని నిత్యం చదవడం అలవర్చుకుంటే జ్ఞానం పెంపొందుతుందని గీతా వాహిని జిల్లా అధ్యక్షురాలు తొడిగల శ్రీదేవిసదానందారెడ్డి అన్నారు. గీతా జయంతి సందర్భంగా బుధవారం వికారాబాద్‌లోని శివాజీ నగర్‌లో మహిళలు గీతా పారాయణం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవచింతనను అలవర్చుకొని సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమ ంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మోమిన్‌పేట్ మండలం టేకులపల్లి హనుమాన్ ఆలయం, అమ్రాదికుర్దు గీతా మందిరంలో గీతా జయంతిని నిర్వహించారు. సామూహిక గీతా పారాయణం చేపట్టారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేద పండితులు దిలీప్ కుమార్, గొల్ల బీరయ్య, సంగారె డ్డి, నర్సిములు, నారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, నాగిరెడ్డి, మల్లారెడ్డి, నాగన్న, శేఖర్, మహిళలు పాల్గొన్నారు. పరిగిలోని సరస్వతీ శిశుమందిర్‌లో గీతా జయంతిని నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడి వేషధారణలో ఉపదేశాలు, నాటకాలు ప్రదర్శించారు. భగవద్గీతలోని శ్లోకాలను, భావాలను వివరించారు. ప్రధానాచార్యులు కె.మల్లేష్ మాట్లాడుతూ.. హిందువులు ప్రతి ఒక్కరు తమ ఇళ్లలో భగవద్గీతను పెట్టుకుని పూజించాలని, రోజూ ఒక శ్లోకం, భావం చదివి అందులోని అంతరార్థం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, ఆచార్యులు, మాతాజీలు, విద్యార్థులు పాల్గొన్నారు. ధారూరులో గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పాండురంగ ఆలయంలో మహిళలు స్వామి వారికి అభిషేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి హారతినిచ్చి మొక్కుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భగవద్గీత పారాయణం చేశారు. పూజారి కుమారస్వామి ప్రసాదాన్ని అందజేశారు.



పరిగి సరస్వతీ శిశు మందిర్‌లో గీతా జయంతి వేడుకలో మాట్లాడుతున్న మాతాజీ భాగ్యలక్ష్మి

సంక్షిప్తంగా..

● **వికారాబాద్:** ఇష్టంతో సాధన చేస్తే గణితంపై పట్టు సాధించొచ్చని జడ్పీ బాలుర పాఠశాల హెచ్‌ఎం జాక వెంకటేశం అన్నారు. బుధవారం పాఠశాల లో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో గణితం పట్ల భయాన్ని పోగొట్టే లా సమస్యలకు సులువుగా సమాధానాలు రాబట్టే మెలకువలపై సాధన చేయాలని సూచించారు. గణితాన్ని గెలిస్తే ప్రపంచాన్ని గెలిచినట్లేనన్నారు. తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ, జిల్లా స్థాయి గణిత ప్రతిభా పోటీలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన రావడం సంతోషకరం అన్నారు. విద్యార్థులు గణితం పట్ల ఇష్టం పెంచుకుని సాధన చేస్తే.. పోటీ పరీక్షల్లో రాణించి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవచ్చ ని సూచించారు. ఈ పరీక్షకు వివిధ పాఠశాలల ను ంచి 150 మంది విద్యార్థులు హాజరు కాగా, 9 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పిల్లిగుండ్ల గణిత ఉపాధ్యాయు డు ఎండీ మోసీన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, వీరేశం, శశిధర్, బసప్ప, అనిల్‌కుమార్, జగదీశ్వరి, రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశం, యశోద, నిర్మల, బాలకుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** బొంరాస్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు రామానుజచారి బుధవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన మృతి పట్ల ఆయన గ్రామం హన్వాడ మండలం ఇబ్రహీంబాద్‌కు వెళ్లి ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. కుటుంబానికి ఎంఈవో హరిలాల్, జీహెచ్‌ఎం రవీందర్‌గౌడ్, యూటీఎఫ్ నాయకులు గౌరారం గోపాల్, మల్లేశ్, అనిల్, అనిల్‌కుమార్, శశిధర్, బాకారం చంద్రశేఖర్, వెంకటేశ్ తదితరులు రామానుజచారి అంత్యక్రియల కోసం ప్రభుత్వం అందించే ఆరిక సాయం రూ.20వేలను కుటుంబానికి అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

● **పరిగి:** మీడియాపై దాడికి పాల్పడిన సినీ నటుడు మోహన్‌బాబును వెంటనే అరెస్టు చేయాలని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి నిరసనగా పరిగిలో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో పరిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం పరిగి బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. కవరేజ్ కోసం వెళ్లిన జర్నలిస్టులపై దాడి చేసిన మోహన్‌బాబుపై కేసు నమోదు చేయాలని, వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో జర్నలిస్టులు పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, రాజేష్, శివకుమార్‌రెడ్డి, చాం ద్, వాజిద్, దర్శన్, రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

● **తాండూరు:** విలేకరుల పట్ల దురుసుగా ప్రవర్తించిన సినీ నటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని తాండూరులో మీడియా ప్రతినిధులు నిరసన తెలిపారు. తాండూరులోని అంబేద్కర్ చౌక్ వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, నరేందర్(లిట్టు), భీమయ్య, శివ, నవీన్, గోపాల్, ఆర్‌విరెడ్డి, శాంత్‌కుమార్, నాయకులు యు. రమేష్, దిశ జిల్లా కమిటీ సభ్యురాలు అంతారం లలిత, పట్టణ బిజేపి అధ్యక్షుడు మల్లేశం, నాయకురాలు సాహు శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** దొడ్డి కొమరయ్య ఆత్మగౌరవ భవనం ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలని కురుమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం తుంకిమెట్లలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14న హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఎమ్మెల్సీ మల్లేశం, రాష్ట్ర మంత్రులు హాజరవుతారన్నారు. మండలంలోని కురుమ సంఘం సోదరులు, నాయకులు తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సప్ప, బీరప్ప, బాలప్ప, పరమేశ్, శ్రీశైలం, మోహన్, మల్లేశ్, వెంకటేశ్, లాలప్ప, మల్లప్ప, యాదప్ప పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

కులకచర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరిగడ్డ తండాలో వీరాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి తన వంతుగా రూ.10వేల విరాళాన్ని అందించారు. బుధవారం తండాకు వెళ్లి నాయకులను కలిశారు. తండా ప్రజల విజ్ఞప్తి మేరకు ఆలయ నిర్మాణానికి విరాళం ఇచ్చారు. ఆలయాల నిర్మాణానికి మున్ముందు సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తండావాసులు లాలూనాయక్, అంగుర్, గణేశ్, కృష్ణారెడ్డి, బిచ్చన్న, అంజి తదితరులు పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న శేరి రాంరెడ్డి